క్లుప్తంగా

అప్సా కో-చైర్మన్‌గా రవీంద్రబాబు



నియామకపత్రం అందుకుంటున్న మేకల రవీంద్రబాబు (కుడి వైపు)

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (అప్సా) రాష్ట్ర కో-చైర్మన్‌గా గుంటూరు నగరంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన సెయింట్ లారెల్స్ స్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు ఎన్నికయ్యారు. విజయవాడలో గురువారం జరిగిన అప్సా రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తనను రాష్ట్ర కౌన్సిల్ కో-చైర్మన్ పదవికి ఎన్నికైనట్లు ప్రకటించిన రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు నియామక పత్రం అందజేసినట్లు రవీంద్రబాబు శుక్రవారం తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రతినిధులు పి. రాము, చంద్రశేఖర్, రామ్మోహన్‌రావు, కోమారెడ్డి కిశోర్, వి. సుందరరావు, కొమరగిరి పాల్గొన్నారు.

బ్యాగులో బంగారు గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: బ్యాగులో బంగారు గొలుసు చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రవీంద్రనగర్‌కు చెందిన శ్రీనివాస్ భార్యతో కలిసి శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆటోలో ప్రయాణించి ఇంటికి చేరారు. లోపలకు వెళ్లి చూడగా బ్యాగు కత్తిరించి ఉంది. అందులోని వంద గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

యువతి వెంటబడి వేధిస్తున్న యువకుడిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆనందరావుపేటకు చెందిన ఫైజల్ ఈనెల 19న ఓ యువతిని జాలయ్య కాలేజీ వద్ద వెంటపడి వేధించాడు. బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. భారత్‌పేట జీరోలైనులో నివసించే చినజాన్ (53) కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈనెల 18న పోలీసు పెరేడ్ గ్రౌండ్ వద్ద పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గుర్తించి జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసన్నాంజనేయునికి జలాభిషేకం



చేబ్రోలు: మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్ క్రీడా ప్రాంగణం నందు స్వయంభువుగా వెలసిన ప్రసన్నాంజనేయ స్వామి 25వ హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామికి 108 కలశాలతో జలాభిషేకం నిర్వహించారు. స్థానిక భక్త బృందం ఆధ్వర్యంలో రాత్రి భజన జరిగింది.

కార్యక్రమాల వివరాలు

25న సిందూరాభిషేకం, 26న పుష్పాభిషేకం, 27న హిరణ్యాభిషేకం, 28న అన్నాభిషేకం, 29న సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, 30న పంచామృతాభిషేకాలు, 31న లక్ష నాగవల్లీ దళాలతో అభిషేకం, 1 న స్వామి వారికి విశేష అభిషేకాలు జరుగుతాయని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. 1న అన్న సంతర్పణ జరుగుతుందని వెల్లడించారు.

తిరుమలకు కాలినడకన ప్రయాణం



భట్టిప్రోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ విజయం సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని, వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామం నుంచి పార్టీ నాయకులు, అభిమానులు శుక్రవారం తిరుమలకు కాలినడకన బయలుదేరారు. సూరేపల్లికి చెందిన పేటేటి దుర్గ ఆధ్వర్యంలో కోనేటిపురానికి చెందిన కర్రా తిరుపతయ్య, చింతమోటుకు చెందిన శొంటి సాయిలు ఈ కాలినడకలో పాల్గొన్నారు. తొలుత సూరేపల్లి గ్రామ దేవత శ్రీ పుట్లమ్మ తల్లికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోజుకు 60 కిలోమీటర్ల చొప్పున నడుస్తూ బుధవారం నాటికి స్వామి వారి సన్నిధి తిరుమలకు చేరుకోనున్నట్లు కిరణ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పీజీ అరుణ్‌శాస్త్రి, మోర్ల కోటేశ్వరరావు, వాకా అంకబాబు, కట్టుపల్లి కిషోర్, బొల్లెద్దు శ్రీకాంత్‌లు సంఘీ భావంగా కొంత దూరం వారితో పాటు నడిచారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

ఆర్‌ఓ కె. రాజ్యలక్ష్మి



అధికారులతో సమావేశమైన అదనపు కమిషనర్, ఆర్‌ఓ కె. రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: ఓట్ల లెక్కింపు సజావుగా, సకాలంలో జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలని అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ కె. రాజ్యలక్ష్మి కోరారు. కౌంటింగ్ జరిగే జూన్ 4న ఉదయం 6.30 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌కు రావాలని ఆమె తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఓట్ల లెక్కింపుపై పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని, సజావుగా జరగడానికి అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని ఆమె కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చేవారు రిటర్నింగ్ అధికారి ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డుల్ని తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్లను కేంద్రంలోకి అనుమతించమని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఐదు, ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ ఉదయం 6.30 గంటలకు తెలుస్తామని, అభ్యర్థులంతా ఆ సమయానికి రావాలని ఆమె సూచించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సీహెచ్. శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు పద్మ, సాంబశివరావు, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ భాస్కర్, పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు



మాట్లాడుతున్న సువీరానందస్వామి

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీమద్భగవద్గీత- ఆత్మసంయమయోగః ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారం ముగిశాయి. ఈనెల 20న జరుబుల బంగారుబాబు సౌజన్యంతో ప్రారంభమవ్వగా, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీ సువీరానందస్వామి ప్రసంగిస్తూ యోగి శాస్త్ర జ్ఞానులు, సకామకర్మలను ఆచరించే వారి కన్న శ్రేష్ఠుడని అన్నారు. భక్తి విశ్వాసాలతో, ధృఢమైన అనన్య భావంతో తనయందే స్థిరబుద్ధుడై ఉండమని శ్రీకృష్ణుడు పలికారని తెలిపారు. నిరంతరం తనను భజించేవాడు పరమ శ్రేష్ఠుడని ఆయన బోధించాడన్నారు. అనంతరం శ్రీసువీరానందస్వామిని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సత్కరించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌ఓ దేవప్రభాకర్

పట్నంబజారు: మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారానికి చెందిన కొనగళ్ల మురళీకృష్ణ (54) అదే ప్రాంతంలో కాళీయ మర్దన దేవాలయాన్ని 2011లో నిర్మించారు. అప్పటి నుంచి ఆలయ బాధ్యతలు ఆయనే చూసుకుంటుండేవారు. ఆలయానికి సంబంధించిన రశీదు పుస్తకాలు కనపడక పోవడంతో మనస్తాపానికి గురైన మురళీకృష్ణ గురువారం రాత్రి కోనేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం మృతదేహం పైకి తేలడంతో గుర్తించిన పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ పి.దేవప్రభాకర్, ఎస్ఐ సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. పలువురికి గాయాలు

రేపల్లె మండలం కామరాజుగడ్డ వద్ద ఘటన





ప్రమాదంలో క్షతగాత్రులు

రేపల్లె రూరల్: ట్రాక్టర్ బోల్తాపడి 20 మందికి పైగా గాయాలైన సంఘటన మండలంలోని కామరాజుగడ్డ గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నగరం మండలం దూళిపూడి పంచాయతీ పరిధిలోని ఉయ్యూరువారిపాలెం గ్రామస్తులు గ్రామ దేవత గుడారంకమ్మ అమ్మవారి కొలుపులలో భాగంగా రెండు ట్రాక్టర్‌లలో రేపల్లె మండలం మోర్తోట కృష్ణానదికి వచ్చారు. ఇదే ఉత్సవాలలో పాల్గొనేందుకు కొల్లిపర్ర మండలం దావులూరువారిపాలేనికి చెందిన 30 మంది మరో ట్రాక్టర్‌లో వచ్చారు. వీరంతా కృష్ణానదిలో పుణ్యస్నానమాచరించి కొలుపులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఉయ్యూరువారిపాలేనికి చెందిన రెండు ట్రాక్టర్లు వెళ్లిపోయాయి. దావులూరివారిపాలేనికి చెందిన వారు గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్తుండగా కామజుగడ్డ వద్ద మలుపు తిరిగే సమయంలో ఒక్కసారిగా రహదారిపై బోల్తా పడింది. అందులో ఉన్న 30 మందిలో 20 మంది వరకు గాయాలపాలయ్యారు. దీంతో స్థానికులు 108కి సమాచారం అందించగా వాహనంలో కొంత మందిని, ప్రైవేటు వాహనాలలో మరికొంత మందిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో తీవ్రంగా గాయాలపాలైన ఉయ్యూరు వెంకటేశ్వరమ్మ, ఉయ్యూరు వీరవెంకటరత్నం, గోపీకృష్ణ, శ్రీహరి, సావిత్రి, వెంకటేశ్వరరావు, భవానీ, సాంబశివరావు, వెంకటలక్ష్మి, మహాలక్ష్మి, వెంకటేశ్వరమ్మలను ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన చికిత్సకు తెనాలి వైద్యశాలకు తరలించారు. స్వల్ప గాయాలైన మిగిలిన వారికి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలోనే చికిత్స అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు చెన్నైలో 'ఏడో రుతువు' పుస్తకావిష్కరణ



ఏడో రుతువు కవితా సంపుటి

తెనాలి: విశ్వర్షి వాసిలిగా ప్రసిద్ధికెక్కిన వాసిలి వసంతకుమార్ తాజా రచన 'ఏడో రుతువు' కవితా సంపుటి ఈనెల 26న చెన్నైలో ఆవిష్కరణ జరగనుంది. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక 'తరతరాల తెలుగు కవిత' పేరుతో నెలనెలా నిర్వహిస్తున్న ఉపన్యాస ధారావాహిక కార్యక్రమాన్ని ఆరోజు సాయంత్రం అక్కడి ఆంధ్రా క్లబ్‌లోని కృష్ణాహాలులో ఏర్పాటు చేశారు. ఇందులో తొలి తెలుగు యౌగిక కావ్యం నేనుః వైవిధ్యత, వినూత్నత అంశంపై విశ్వర్షి వాసిలి ప్రసంగిస్తారు. ఆయన రాసిన కవితల సంపుటి 'ఏడో రుతువు' పుస్తకాన్ని ఇదే వేదికపై ఆవిష్కరిస్తారు. వేద విజ్ఞానవేదిక అధ్యక్ష, కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు పర్యవేక్షిస్తారు. సనాతన ధర్మ మూలాలకు సామాజిక స్పృహను జోడించి వ్యక్తిత్వ వికాస విజ్ఞానాన్ని సరళంగా అందిస్తున్న విశ్వర్షి వాసిలి నిజానికి మాస్టర్ యోగ గురువు. సొంతూరు తెనాలి సమీపంలోని కోపల్లె. ఆంగ్లోపన్యాసకుడిగా, మాస్టర్ యోగ గురువుగా, బహుగ్రంథకర్తగా తెలుగువారికి సుపరిచితులైన శతాధిక గ్రంథకర్త 'మాస్టర్' శార్వరి కుమారుడు. సికింద్రాబాద్‌లో తండ్రి స్థాపించిన 'యోగాలయ' రీసెర్చ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఆర్కివ్స్ సెంటర్, మీడియా వెల్ఫేర్ సెంటర్, కౌన్సెలింగ్ సెంటర్‌నూ నడుపుతున్నారు. వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక మనో విశ్లేషణలకు పుస్తక రచనల వాకిళ్లను తెరిచి, తన అసంఖ్యాక రచనలతో తెలుగులో ప్రత్యేకస్థానం దక్కించుకున్నారు. గీత నుంచి మొదలుపెట్టి, అనేక ప్రాక్పశ్చిమ తాత్విక అంశాలపై ఆయన రాసిన పుస్తకాలు ప్రజాదరణను పొందాయి. 'వాసిలి వాకిలి' కాలమ్ పాఠకుల విశేష అభిమానాన్ని అందుకుంది. ఆ కలం నుంచి వెలువడిన 'నేను', తెలుగులో తొలి యౌగిక కావ్యం. ఆధ్యాత్మిక దృష్టి కోణానికి ఆధునికతను మేళవించిన 'నేను' విశ్వావలోకనం తెలుగు సాహిత్య చరిత్రలో నవీన ప్రయోగంగా మేధావుల ప్రశంసలందుకుంది.

నేటి నుంచి వైకుంఠవాసుడి బ్రహ్మోత్సవాలు

తెనాలి: తెనాలిలోని వైకుంఠపురం దేవస్థానం దేశంలోని పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా, ఇక్కడి ప్రజలకు చిన్న తిరుపతిగా విలసిల్లుతోంది. పట్టణానికి దక్షిణంగా ప్రశాంత వాతావరణంలో ఉందీ ఆలయం. నిత్యకల్యాణం పచ్చతోరణంగా సేవలందుకుంటున్న కలియుగ నాయకుడు శ్రీవేంకటేశ్వరుడు, భక్తాభీష్ట వరదుడై లక్ష్మీపద్మావతి సమేతంగా, పరమ ప్రసన్న శోభను చిందిస్తూ, బహుముఖ వైభవోపేతుడై వెలుగొందుతున్నాడు. వేలాది భక్తులు, దాతల వితరణ, పాలకవర్గాల కృషితో పవిత్ర యాత్రాస్థలంగా శోభిల్లుతోంది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఏటా వైభవోపేతంగా జరుగుతుండే వైకుంఠపురవాసుని బ్రహ్మోత్సవాలు ఎన్నికల కోడ్ కారణంగా సంప్రదాయం ప్రకా రం ఆడంబరాలకు పోకుండా నిర్వహించనున్నారు. తొలిరోజు ఉదయం శ్రీస్వామి, అమ్మవార్లకు విశేషార్చన, పూజలతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తా రు. 27న నగర సంకీర్తన, 28న సుదర్శన దివ్యానుగ్రహ హోమం, స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తారు. 31న వేద స్వస్తితో ఉత్సవాలు పూర్తవుతాయి. ఉత్సవాల్లో బాగంగా ప్రతిరోజూ హరి కథ, బుర్రకథ, సుందరకాండ పారాయణం, కూచిపూడి నృత్యం, గాత్రకచేరీ, అన్నమయ్య సంకీర్తనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెదకాకాని: ప్రతి జిల్లాలోనూ వ్యక్తిత్వ వికాస మోటివేటర్‌లను తయారు చేయాలనే ఉద్దేశ్యంతో తెలుగు రాష్ట్రాల్లో వేలాది మందికి ఎస్‌టీఈఎఫ్ ఆధ్వర్యంలో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇస్తున్నట్లు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీల్లో గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం, నెక్కల్లు గ్రామంలోని అబ్బూరి కోటేశ్వరరావు ధ్యాన మందిరంలో స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఉచిత వసతి, భోజన ఏర్పాటు, మెటీరియల్‌తో పరిపూర్ణ శిక్షణ, అనంతరం సర్టిఫికేట్ పంపిణీ జరుగుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనే వారు మే 29న సాయంత్రానికి వేదిక వద్దకు చేరుకొని మూడు రోజులు అక్కడే ఉండే విధంగా రావాలని సూచించారు. పది అంశాలలో ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9491509440 నంబరులో సంప్రదించాలన్నారు.

మూడు ఇసుక లారీలు, జేసీబీ మిషన్ సీజ్



మున్నంగి (కొల్లిపర): మండల పరిధిలో మున్నంగి గ్రామంలో ఎటువంటి రసీదులు లేకుండా అక్రమంగా ఇసుకను మూడు లారీలలో శుక్రవారం తరలిస్తుండగా గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ ఆర్.రవీంద్రారెడ్డి కేసు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ మున్నంగి గ్రామంలో ఇసుక మాఫియా ముఠా ఖాళీ స్థలంలో నిల్వ ఉంచిన ఇసుకను గుట్టు చప్పుడు కాకుండా లారీలు ద్వారా తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. మూడు లారీలు ద్వారా తరలిస్తున్న ఇసుకను, లోడింగ్ పాయింట్ వద్ద ఉన్న జేసీబీ మిషన్ పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఇసుక, మట్టి రవాణా సమయంలో ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని వే బిల్లు ద్వారా మాత్రమే తరలించాలని, లేనిపక్షంలో కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరం: స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆరు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు వెల్లడించారు. పూజల అనంతరం ప్రతిరోజు అన్నదానం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పూజా పెద్దఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

స్కిజోఫ్రీనియాపై అశ్రద్ధ వద్దు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ వెంకట కిరణ్

గుంటూరు మెడికల్: ప్రపంచ స్కిజోఫ్రీనియా అవగాహనా దినోత్సవం సందర్భంగా గుంటూరు జీజీహెచ్‌లోని మానసిక వైద్య విభాగంలో శుక్రవారం ఇంటర్నల్, పీజీ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ హారిక మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఒత్తిడి వల్ల పలువురు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డాక్టర్ దయానిధి మాట్లాడుతూ మానసిక సమస్యల్ని వెంటనే గుర్తించి చికిత్స అందిస్తే రోగి త్వరగా కోలుకుంటారని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమా జ్యోతి, సహ ఆచార్యులు డాక్టర్ వెంకట కిరణ్, డాక్టర్ సాయి కిరణ్, నిమీష, సాయికృష్ణ, రత్న కిషి, ప్రసాద్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై ఆకట్టుకున్న వర్క్‌షాప్



విద్యార్థులు తయారు చేసిన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కృష్ణప్రసాద్, రథినీచౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో ఆరు నుంచి టెన్త్ విద్యార్థులకు రోబోటిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. టిస్లా హౌస్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ఆవిష్కరణలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రోబోటిక్స్‌పై అవగాహన వల్ల విద్యార్థులకు సైన్స్, సెన్సార్లు, మోటార్లు, ప్రోగ్రామింగ్‌పై పట్టు సాధించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. భవిష్యత్తులో రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాముఖ్యత పెరుగుతుందని, తద్వారా విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించడం ద్వారా ఉన్నతస్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. విద్యార్థుల్ని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా, సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దేందుకు రెండు వారాల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి, ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్రసాములో పాటిబండ్ల స్కూల్ విద్యార్థిని ప్రతిభ



జగ్వీ కృష్ణను అభినందిస్తున్న విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి, నరేంద్రనాథ్

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ కర్రసాము (సిలంబం) పోటీల్లో తమ పాఠశాల 7వ తరగతి విద్యార్థిని ఎం. జగ్వీ కృష్ణ కాంస్య పతకాన్ని సాధించినట్లు శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరల్డ్ యూనియన్ సిలంబం ఫెడరేషన్ ఈనెల 17,18,19వ తేదీల్లో నూతక్కిలో నిర్వహించిన ఓపెన్ ఏషియన్ చాంపియన్‌షిప్ సిలంబం పోటీల్లో తమ విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ చూపిందని పేర్కొన్నారు. యుద్ధ విద్య అయిన కర్రసాములో ప్రావీణ్యం సాధించడం గొప్ప విషయమని, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపే విధంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని జగ్వీకృష్ణతో పాటు కోచ్‌లు బి. కిరణ్ బాబు, వి. రామకృష్ణను పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, పాటిబండ్ల నరేంద్రనాథ్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి అభినందించారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ఎన్‌డీఆర్‌ఎఫ్ శిక్షణ



నంబూరు వీవీఐటీలో ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రాజీవ్, రాబిన్‌కుమార్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహిస్తున్న 10ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ విద్యార్థులు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. శిబిరంలో మూడో రోజైన శుక్రవారం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రాజీవ్, రాబిన్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ బాలికలకు విపత్తుల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రాణాలు కాపాడుకునే పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు కావలసిన పరికరాలు, వాటిని తయారు చేసుకునే విధానం, వాటి ద్వారా బాధితులను ఎలా కాపాడుకోవాలి వంటి అంశాలపై అవగాహనతో పాటు శిక్షణ అందించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ పట్వాల్, వీవీఐటీ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఏ శ్రీవాణి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

గుంటూరు 25 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సీఎస్ సిద్ధు



మాట్లాడుతున్న కల్నల్ సిద్ధు

గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గుంటూరు 25 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సీఎస్ సిద్ధు పేర్కొన్నారు. గుంటూరు ఇంజినీరింగ్ కాలేజీలో (కిట్స్ అక్షర్) జరుగుతున్న ఎన్‌సీసీ మాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడేట్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి సమాజం పట్ల బాధ్యత కలిగి జీవించాలని ఆయన సూచించారు. దేశాన్ని గౌరవించడంతో పాటు సమాజంలోని విభిన్న జాతులు, సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ సమాజాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ శిక్షణ శిబిరంలో ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, ఫైరింగ్, టెంట్ పిచ్చింగ్, డ్రిల్ కల్చర్ యాక్టివిటీస్, డాన్సింగ్, సింగింగ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేసి ఉత్తేజాన్ని కలిగిస్తాయని, మనో వేగాన్ని నియంత్రించే శక్తి క్రీడలకు ఉంటుందని అన్నారు. క్రీడలకు దూరంగా ఉండటం వల్ల విద్యార్థులు శారీరక ఆకృతిని కోల్పోతున్నారని అన్నారు. క్రీడలు మానసిక సంతోషం కోసం ఆడాలని సూచించారు. క్రీడలలో విజయం మనలో నూతన ఉత్తేజాన్ని పెంపొందిస్తే , ఓటమి మరో అడుగు వేయటానికి నూతన ఆలోచనలు రేకెత్తిస్తుందని అన్నారు. ప్రధానంగా క్రీడలు సమాజంలో విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకోటయ్య, కేర్‌టేకర్ బి నాగమల్లికార్జునరావు, ఎక్స్ సుబేదార్ అబ్దుల్ బేగ్, 25 ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ మేజర్ విజయ్ మోహితే, ఆర్మీ సిబ్బంది, ఏఎన్‌వోలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సీఐ వీరేంద్రబాబు

ఫిరంగిపురం: మండలంలోని గ్రామాల్లో ఓట్ల లెక్కింపు రోజున ఎన్నికల నిబంధనల ప్రకారం శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ వీరేంద్రబాబు హెచ్చరించారు. స్థానిక స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ముందు గానీ, తర్వాత గానీ సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు అంతకంటే ఎక్కువ మంది ఒకేచోట గుమికూడి ఉండకూడదని సూచించారు. సమస్యలు సృష్టించే వ్యక్తులపై నిఘా ఉందని తెలిపారు. సంఘ విద్రోహ శక్తులను గుర్తించి వారిపై ప్రత్యేక సిబ్బంది ద్వారా ప్రతి కదలికల్ని గమనిస్తున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల పార్టీల నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ వీరనారాయణ, ఏఎస్ఐ శ్రీనివాసరావు, మోహన్‌రావు, రైటర్ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ చుక్కా శ్రీనివాసబాబు మృతి



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్, బసవమందిరం ఆలయం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చుక్కా శ్రీనివాసబాబు (58) శుక్రవారం ఉదయం మారీసుపేట సీబీఎన్ కాలనీలోని తన స్వగృహంలో మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య ఉన్నారు. సంతానం లేరు. తన తండ్రి భాను స్టూడియో నిర్వాహకుడైన బసవకోటయ్య వద్ద ఫొటోగ్రఫీ నేర్చుకుని అదే వృత్తిలో స్థిరపడ్డారు. గత 25 ఏళ్లుగా వివిధ కార్యక్రమాల ఫొటోలను పత్రికలకు పంపిస్తూ ప్రెస్ ఫొటోగ్రాఫర్‌గా గుర్తింపును పొందారు. శివభక్తుడైన శ్రీనివాసబాబు శైవాలయాల ఉత్సవాల్లో శివతాండవం నృత్యంలో ప్రత్యేకతను సాధించారు.